క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



బెహరా భాస్కరరావుకు మొక్క అందిస్తున్న హెచ్ఎం వేణుగోపాల్

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించిన వై. వేణుగోపాల్ ఆదివారం జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావును ఆయన ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. పాఠశాలను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి సహకరించాలని కోరారు. క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు, క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని భాస్కరరావు హెచ్ఎంకు సూచించారు. కార్యక్రమంలో 92వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అప్పలస్వామి, సత్తిబాబు, గొంతిన నాగరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కరించాలి



డీఏఆర్‌నగర్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్థానికులతో గోపాలకృష్ణ

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు డీఏఆర్‌నగర్‌లో లో వోల్టేజీ సమస్య పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ ను స్థానికులు కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం డీఏఆర్‌నగర్‌లో పర్యటించి స్థానికుల ఇబ్బందులు తెలుసుకున్నారు. సమస్యను పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదారి ఆనంద్ కుమార్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఆయన ద్వారా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీఏఆర్‌నగర్ వాసులు పాల్గొన్నారు.

స్ఫూర్తి అనాథ శరణాలయంలో యోగా డే



యోగా తరగతులు నిర్వహిస్తున్న ఐఎన్ఎస్ డేగా అధికారులు

సింధియా: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా ఫర్ హ్యూమానిటీ అనే ఇతివృత్తంతో ఐఎన్ఎస్ డేగాలోని తూర్పు నౌకాదళ అధికారులు స్ఫూర్తి అనాథశరణాలయంలో యోగా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో 40 మంది పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లలు తమ రోజువారీ దినచర్యలో యోగాను చేర్చడం ద్వారా వారి మానసిక, శారీరక ధృఢత్వానికి మేలు చేకూరుతుందని పేర్కొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు పెద్దరాజు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.



60వ వార్డులో నిర్మించిన ప్రజా వైద్యశాల



టీడీపీ హయాంలో మెట్లకు కూడా నోచుకోని 59వ వార్డు నక్కవానిపాలెం ప్రాంతం



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నక్కవానిపాలెం కొండ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మెట్ల మార్గం

ప్రగతి పరుగులు

- పారిశ్రామిక ప్రాంతంలో అభివృద్ధి పనులతో స్థానికుల ఖుషీ
- ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్న జనం
- మరింత అభివృద్ధి చేస్తామని భరోసా ఇస్తున్న ఆనంద్‌కుమార్



ములగాడ ఎస్సీ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు



58వ వార్డు శ్రీరామ్‌నగర్ వద్ద టీడీపీ హయంలో వీధి కాలువలు, సీసీ రోడ్డు వేయని దృశ్యం



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక జీవీఎంసీ 58వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో ఏర్పాటైన సీసీ కాలువ, సీసీ రోడ్డు

మల్కాపురం : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మునుపెన్నడూ లేని విధంగా పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధిలో పరుగులు తీసింది. పలు వార్డుల్లో పెండింగ్ పనులు, కొత్త నిర్మాణాలు చేపట్టి జనం మెచ్చిన ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అన్న విధంగా తీర్చిదిద్దారు.

58వ వార్డు పరిధిలో..

జీవీఎంసీ 58వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో సుమారు రూ. కోటి వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణాలు జరిగాయి. అలాగే ములగాడలో రూ. 20 లక్షలతో బీటీ రోడ్డు, రూ. 50 లక్షలతో కమ్యూనిటీ హాలు, శ్రీహరిపురం, పిలకవానిపాలెం, ములగాడ ప్రాంతాల్లోని జీవీఎంసీ పాఠశాలలకు నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా చేసిన అభివద్ధి పనులకు రూ. 4 కోట్లు ఖర్చు చేశారు. అలాగే వీధి కాలువలకు రూ. 1.5 కోట్లు, పది పడకల ఆస్పత్రి నిర్మాణానికి రూ. 90 లక్షలు ఖర్చు చేశారు.

59వ వార్డు పరిధిలో..

ఈ వార్డు పరిధి వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ. 60 లక్షలు, కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గానికి రూ. 30 లక్షలు, సామాజిక భవనాల మరమ్మతు పనులకు రూ. 9 లక్షలు, 10 పడకల ఆస్పత్రి నిర్మాణానికి రూ. 90 లక్షలు ఖర్చు చేశారు.

60వ వార్డు పరిధిలో..

ఈ వార్డు పరిధిలో వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ. కోటి , అలాగే వీధి కాలువల కోసం రూ. 60 లక్షలు, సామాజిక భవనం నిర్మాణానికి రూ. 30 లక్షలు, జీవీఎంసీ ఆసుపత్రిలో పలు అభివద్ధి పనులకు రూ. 10 లక్షలు ఖర్చు చేశారు.

61వ వార్డు పరిధిలో..

ఈ వార్డు పరిధిలో వివిధ ప్రాంతాల్లో రూ. 16 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, రూ. 20 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణాలు జరిగాయి. ఇంకా పలు వార్డుల్లో కోట్ల రూపాయలతో వచ్చే ఏడాదిలోపు మరిన్ని అభివద్ధి పనులు జరగనున్నాయి.

మరింత అభివృద్ధి దిశగా..



వచ్చే ఏడాది చివరి నాటికి పశ్చిమ పరిధిలోని పలు వార్డుల్లో కోట్ల రూపాయలతో మరిన్ని అభివృద్ధి పనులు జరగనున్నాయి. అలాగే పలు వార్డుల్లో చిల్డ్రన్ పార్కులు, స్విమ్మింగ్ పూల్స్, సామాజిక భవనాలు, వాకింగ్ ట్రాక్‌లు, కొండ వాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణాలు జరగనున్నాయి. హెచ్‌పీసీఎల్, కోరమాండల్ వంటి పరిశ్రమల సాయంతో పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా అన్ని రోగాలకు ఉచిత వైద్య కేంద్రం, ఉచితంగా మందులు పంపిణీ చేసే కేంద్రం ఏర్పాటుకు ఆలోచన ఉంది. దీనిపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలను కలిసి మాట్లాడి అన్ని వసతులతో కూడిన ప్రజా వైద్యశాల, క్రీడా మైదానం ఏర్పాటు చేస్తాం.

ఆదారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త.

భానుడు భగభగ



ఖాళీగా కనిపిస్తున్న మల్కాపురం మెయిన్ రోడ్డు

మల్కాపురం: ఎండ తీవ్రతకు జనం విలవిల్లాడుతున్నారు. ఈ ఏడాది జూన్ మాసంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చాలా మంది వడదెబ్బకు గురవుతున్నారు.ఎండ వేడి ఆపై వడగాడ్పు జనాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. ఇంట్లో ఉండ లేక బయటకు రాలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం భానుడి ప్రతాపానికి పారిశ్రామిక ప్రాంతంలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. నిత్యం రద్దీగా ఉండే రోడ్లు సైతం బోసిపోయాయి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన వారు నానా అవస్థలు పడ్డారు.

ముగిసిన బాక్సింగ్ శిక్షణ శిబిరం



క్రీడాకారులను అభినందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారులు ట్రైసన్ రామారావు, సాహోల ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు బాక్సింగ్ క్రీడాకారులు ట్రైసన్ రామారావు, సాహోను అభినందించారు. కోరమాండల్ హెచ్ ఆర్ శ్రీనివాసరావుతో కలిసి శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేసి, అభినందించారు. కోరమాండల్ సీఎస్ఆర్ నిధుల నుంచి పారిశ్రామిక ప్రాంతంలోని బాక్సర్ల కోసం బాక్సింగ్ రింగ్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ నాగేశ్వరరావు కోరారు. క్రీడాకారులు కూడా పోటీల్లో గెలుపొంది రాష్ట్రానికి, పారిశ్రామిక ప్రాంతానికి మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.

దంత వైద్య శిబిరానికి విశేష స్పందన

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీ లో న్యూస్మైల్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ కల్యాణి, పావని పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవ శరీరంలో దంతాలు కూడా అత్యంత ప్రధానమైనవన్నారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు చంటిబాబు, మీసాల సత్యనారాయణ, ఇతర నాయకలు పాల్గొన్నారు.

ఘనంగా శిఖర ప్రతిష్టాపన మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మ వారి ఆలయంలో ఆలయ పునర్నిర్మాణం, ఆలయ శిఖర ప్రతిష్టాపన మహోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. వేద పండితుల ఆధ్వర్యంలో విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా గణపతి పూజ, దీక్షాధారణ, వాస్తు యోగిని క్షేత్రపాలక నవగ్రహ సర్వతోభద్ర మండప పూజలు, అధివాసాలు, జలాధివాసం, క్షీరవాసం, ధాన్య, క్షయాధివాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ, ఆలయ సిబ్బంది, సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సోమ వారం ఉదయం జరిగే శిఖర ప్రతిష్ట, మధ్యాహ్నం జరిగే భారీ అన్నసమారాధన కార్యక్రమాలకు టీటీడీ చైర్మన్, రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఆలయ పునర్నిర్మాణ దాత ఆదారి ఆనంద్‌కుమార్, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, దేవదాయ శాఖాధికారులు పాల్గొంటారని ఎర్నిమాంబ ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.వెంకట సత్యసురేష్‌బాబా తెలిపారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



విద్యార్థులకు సర్టిఫికెట్లు, టిఫిన్ బాక్సలు అందిస్తున్న 40వ వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని గ్రంథాలయంలో రాష్ట్ర పౌరగ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ఘనంగా ముగిసింది. వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, షిప్‌యార్డ్ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ సెక్రటరీ చంటిబాబు వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, హాట్‌బాక్స్‌లు, టిఫిన్ బాక్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడానికి వేసవి విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేశారని చెప్పారు. గాంధీగ్రామం పశువుల ఆస్పత్రి పక్కన ఉన్న గ్రంథాలయాన్ని షిప్‌యార్డ్ యాజమాన్యంతో మాట్లాడి పునర్నిర్మించే విధంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ కృషి చేస్తున్నారని చెప్పారు. త్వరలోనే నిర్మాణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో లైబ్రరీ నిర్వాహకులు కనకరాజు, నాయకులు మీసాల సత్యనారాయణ, శామ్యూల్, ఆశకార్యకర్తలు నాగమణి, రాజేష్, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఆ పార్టీల వైఖరి స్పష్టం చేయాలి

- 'ఉక్కు' ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అందరూ ఐక్యమవ్వాలి
- ఉక్కు పోరాట కమిటీ నేతలు



850వ రోజు దీక్షలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: కేంద్రప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చి 850 రోజులు గడుస్తున్న రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల్లో ఇప్పటి వరకు ఎటువంటి స్పష్టత లేదని, కేంద్ర హోంమంత్రి అమిషా విశాఖ పర్యటన సంర్భంగానైనా అధికార, విపక్షాలు పార్టీలు ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేకంగా తమ వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 850వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో స్టీల్ ప్లాంట్‌లోని వివిధ విభాగాల కార్మికులు, భూనిర్వాసితులు, వారి కుటుంబాలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా వేల కోట్లు టర్నోవర్ చేసిన విశాఖ ఉక్కు పరిశ్రమకు ఈ ఏడాది ముడి సరుకు అందించకుండా నష్టాల వైపు నెట్టారని విమర్శించారు. తెలుగు ప్రజల బలమైన ఆకాంక్ష అయిన విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించే విధంగా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం

సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్‌కు వినతి



రక్తదానం చేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు, పాల్గొన్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: ఎస్‌ఏడీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయ సమీపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. వాటిని పరిష్కరించాలని కోరుతూ కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి డి.చంద్రశేఖర్ విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు ఆయనకు వివరించారు. విద్యుత్ సంస్థలో మూడో పార్టీ విధానాన్ని రద్దు చేసి నేరుగా జీతాలు ఇచ్చేలా చూడాలని కోరారు. రెగ్యులేషన్‌కు సంబంధించి విద్యుత్ యాజమాన్యం తరఫున కేబినెట్ సబ్ కమిటీకి ప్రతిపాదనలు పంపాలన్నారు. 2022 పీఆర్సీతో కలిపి డీఏ, ఇంక్రిమెంట్లతో కూడిన వేతనాలు చెల్లించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, రిటైరయ్యే కార్మికులకు గ్రాడ్యుటీ చెల్లించాలని, కుటుంబ సభ్యులతో కూడిన హెల్త్ కార్డులు ఇవ్వాలని, సబ్ స్టేషన్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతున్నారన్నారు. ఇటీవల కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులైజ్ చేసి వారికి ఎంతో మేలు చేకూర్చారని కొనియాడారు. మిగిలిన వారికి కూడా తగిన న్యాయం చేస్తారన్నారు.

అసోసియేషన్ సభ్యుల రక్తదాన శిబిరం

సర్వసభ్య సమావేశంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు కార్మికులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సుమారు 18 యూనిట్ల రక్తాన్ని అందించారు. విశాఖ బ్లడ్ సెంటర్ సౌజన్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్ఎస్ మూర్తి, జగదీష్ కుమార్, జిల్లా నాయకులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

వాకర్ ఆకస్మిక మృతి



మృతి చెందిన బీఎస్ఎన్ రెడ్డి

మురళీనగర్: మురళీనగర్‌లో ఒక వాకర్ వాకింగ్ చేస్తుండగా ఆకస్మికంగా మృతి చెందారు. వివరాలిలా.. ఈ ప్రాంతానికి చెందిన బీఎస్ఎన్ రెడ్డి (75) ప్రతి రోజు లాగానే ఆదివారం ఉదయం 5 గంటలకు వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వాకింగ్‌కు వచ్చారు. ఆయన వాకింగ్ ట్రాక్‌పై ఒక రౌండ్ నడిచిన తర్వాత కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు కూర్చుంటుండగా కుప్పకూలిపోయారు. వాకర్స్ వచ్చి ఆయనకు సపర్యలు చేసి 108కు ఫోన్ చేసినప్పటికి అప్పటికే రెడ్డి మృతి చెందినట్లు గుర్తించారు. అతని మృత దేహాన్ని స్వగృహానికి తరలించారు. గుండె పోటుతో ఆయన మృతి చెంది ఉంటారని భావిస్తున్నారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు జీవిత కాలం సభ్యుడిగా బీఎస్ఎన్ రెడ్డి ఉన్నారు. ఆయన మరణంతో ఆదివారం పార్కును మూసివేశారు. పార్కు అధ్యక్ష, కార్యదర్శులు సనపల వరప్రసాద్, సి.నాగ రాజు, కోశాధికారి మళ్ల రామకృష్ణ సంతాపం ప్రకటించారు.

వెలకట్టలేనిది పుస్తక సంపద



గ్రంథాలయాధికారిని సత్కరిస్తున్న అతిథులు



అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

మల్కాపురం : గ్రంథాలయాల్లో మనకు లభించే పుస్తక సంపద వల్ల కొత్తకొత్త విషయాలు తెలుసుకోవచ్చని, బాలలు తమ దగ్గరలో ఉన్న గ్రంథాలయాలకు క్రమం తప్పక వెళ్లాలని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో గత 35 రోజుల నుండి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలలు, యువత, వృద్ధులు అందరికీ విజ్ఞానం అందించే పుస్తక సంపద మన గ్రంథాలయాల్లో లభిస్తుందన్నారు. ఎటువంటి ఖర్చు లేకుండా మన ప్రభుత్వం వీటిని ప్రజలందరికీ అందుబాటులో ఉంచుతుందన్నారు. గ్రంథాలయం దేవాలయం వంటిదని అన్నారు. పలువురు చిన్నారులు చేసిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్‌ను పలువురు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రచయిత, చిత్రకారుడు సుంకర చలపతిరావు, సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి, కార్మిక సంఘ నాయకుడు బి.సత్యనందం, వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నైట్ షెల్టర్‌కు అనాథ మహిళ తరలింపు



మహిళను నైట్ షెల్టర్‌కు తరలిస్తున్న అధికారులు

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులో సంచరిస్తున్న అనాథ మహిళను నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు. స్థానిక వైఎస్ఆర్‌సీపీ నాయకుడు నీల రెడ్డి ఇచ్చిన సమాచారంతో టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ నైట్ షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి వెంటనే స్పందించారు. అనాథ మహిళను ప్రత్యేక వాహనంలో నైట్ షెల్టర్‌కు తరలించి ఆశ్రయం కల్పించారు. అనాథలు, బిచ్చగాళ్లు ఎవరైనా రోడ్లపై కనిపిస్తే 77939 77705 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారమిస్తే వారిని నైట్ షెల్టర్‌కు తరలించి ఆశ్రయం కల్పిస్తామని జ్యోతిర్మయి తెలిపారు.